ఈనాడు
epaper.eenadu.net

# పాతబస్తీ మెట్రోకి భూసేకరణ

- రూ.800 కోట్లు అవుతుందని అంచనా
- ఆస్తుల యజమానులెవరో తెలపాలని కలెక్టర్‌కు హెచ్ఎంఆర్ లేఖ
- బడ్జెట్‌లో రూ.500 కోట్ల కేటాయింపు.. నిధుల విడుదలపై ఆశలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి ఇటీవల పాతబస్తీ మెట్రో శంకుస్థాపన సందర్భంగా అలైన్‌మెంట్ గురించి వివరిస్తున్న హెచ్ఎంఆర్ ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: పాతబస్తీ మెట్రో రైలు మార్గంలో ఆస్తుల సేకరణకు అయ్యే వ్యయం పెరగనుంది. గతంలో 80 అడుగులకే పరిమితం చేయాలనుకున్న రోడ్డు విస్తరణను మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులకు విస్తరించాలని నిర్ణయించడంతో సేకరించాల్సిన ఆస్తుల సంఖ్య పెరగనుంది. స్టేషన్లు ఏర్పాటు చేసే నాలుగు ప్రదేశాల్లో 120 అడుగులు ఉండేలా చూడనున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. మార్గంలో 1100 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని... ఇందుకు రూ.800 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా. పాతబస్తీ మెట్రోకి ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించారు. వీటిని మంజూరు చేస్తే భూసేకరణను మొదలెట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఇక్కడో చిక్కుంది. చాలావరకు పురాతన భవనాలు ఉన్నాయి. వాటి యజమానులు ఎవరనేది కచ్చితంగా తెలిస్తేనే పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకోవడం సాధ్యం అవుతుంది. రికార్డుల ద్వారా యజమానులు ఎవరో గుర్తించాలని హైదరాబాద్ కలెక్టర్‌కు మెట్రో అధికారులు లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ(హెచ్ఎంఆర్)లోనే భూసేకరణ విభాగం ఉంది. ఒక డిప్యూటీ కలెక్టర్, ఇద్దరు తహసీల్దార్లు ఉన్నారు. భూసేకరణ పనులను వీరు చూడనున్నారు.

## రహదారి విస్తరణ తర్వాతే పనులు

ఆస్తుల సేకరణ కొలిక్కి వచ్చాక అక్కడ ఉన్న విద్యుత్తు, భూగర్భ మంచినీటి, డ్రైన్ పైపుల వంటివి ఇతర చోట్లకు మారుస్తారు. అనంతరం 100 అడుగులకు రహదారిని విస్తరిస్తారు. అప్పుడే మెట్రో పనులకు రైట్ ఆఫ్ వే లభిస్తుంది. ఈ ప్రక్రియ అంత పూర్తయ్యేసరికి కనీసం ఏడాదైనా పడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ వ్యయం రూ.2వేల కోట్లు కాబట్టి ప్రభుత్వంపై పెద్దగా భారం లేకుండా ఏడాదికి రూ.500 కోట్లు కేటాయిస్తే నాలుగేళ్లలో పూర్తి చేయవచ్చు అంటున్నారు. ఈసారి బడ్జెట్‌లో కేటాయించిన వాటిలో తొలుత రూ.200 కోట్లు ఇచ్చినా ఆస్తుల సేకరణ ప్రక్రియ మొదలెట్టవచ్చు.

## అభ్యంతరాలు పెద్దగా ఉండకపోవచ్చు

గతంలో అభ్యంతరం పెట్టిన మజ్లిస్ పార్టీ నేతలే.. ఇప్పుడు సీఎంతో కలిసి శంకుస్థాపన వేడుకల్లో పాల్గొన్నారు. ఆస్తుల సేకరణకు సంబంధించి వీరి సహకారం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కాబట్టి పాతబస్తీలో మెట్రో అలైన్‌మెంట్ కోసం ఆస్తుల సేకరణ పెద్ద సమస్య కాబోదని అంటున్నారు.

Date : 21/03/2024 EditionName : GREATER HYDERABAD PageNo :